

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో జరిగిన నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 24 మార్చి 2025 | HYDERABAD

## న్యాక్ ఇంజినీర్లపై వేటు

### 27 మందిని తొలగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు

సిటీబ్యూరో, మార్చి 23, (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో 27 మంది నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్) ఇంజినీర్లపై వేటు వేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. గడిచిన కొంత కాలంగా అక్రమ నిర్మాణాల విషయంలో న్యాక్ ఇంజినీర్లు డబ్బులు తీసుకున్నట్లు కమిషనర్‌కు పలువురు బాధితులు స్వయంగా ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపి సమగ్ర విచారణకు ఆదేశాలు జారీశారు. జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 100 మంది న్యాక్ ఇంజినీర్లు ఉండగా, ప్రధానంగా 27 మంది అవినీతికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



# ఈసారి వరద ముంపు తథ్యం

### నాలా పూడికతీతపై బల్దియా మీనమేషాలు
### టెండర్ దశలోనే సమయం వృథా
### మార్చి ముగుస్తున్నా.. మొదలు కాని పనులు
### మే నెలాఖరు నాటికి లక్ష్యం చేరుకోవడం అసాధ్యమే
### నగరానికి పొంచి ఉన్న వరద బాధలు



బాలానగర్‌లో నాలా దుస్థితి ఇది..

సిటీబ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : నాలా పూడికతీత పనులపై జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వహిస్తోందా? డిసెంబర్ నెలలో నాలా పనులకు టెండర్లు ముగించాల్సిన అధికారులు మార్చి ముగింపు వచ్చినా నేటికీ టెండర్ల దశలోనే కాలయాపన చేస్తోందా? చాలా చోట్ల పనులు ఇంకా మొదలు కాలేదా? ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా తూతూ మంత్రంగా నాలా పూడికతీత పనులను ముగుస్తుందా? అంటే క్షేత్రస్థాయి పరిస్థితులు అవుననే సమాధానం ఇస్తున్నాయి. వాస్తవంగా జనవరి నుంచి మే నెలాఖరు వరకు పనులకు అనుకూల సమయం.. ప్రాజెక్టు అయినా, నాలా పనులైన యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చు. కానీ ఘనత వహించిన బల్దియా ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం నాలా పూడికతీత పనులను సకాలంలో చేపట్టి పూర్తి చేయాల్సిన చోట మూడు నెలలుగా టెండర్ల దశలోనే ఊగిసలాడుతున్నది. జోనల్ వారీగా కోటి రూపాయల పనులను 10 విభాగాలుగా విభజించిన అధికారులు గ్రౌండింగ్‌లో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో పనుల పారదర్శకతపై అనుమానాలు లేకపోలేదు.

### డిసెంబర్‌లో జరగాల్సిన పూడికతీత..

ప్రతి ఏడాది దాదాపు రూ.60 కోట్ల మేర నాలా పూడికతీత పనులకు టెండర్లు పిలిచి తొలకరి జల్లులు కురిసే నాటికల్లా పూడికతీత పనులను పూర్తి చేసి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలి. కానీ ఘనత వహించిన జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ నిర్వహణ విభాగం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇప్పటికే చెల్లించాల్సిన1400 కోట్ల రూపాయలు అందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు మొరాయిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే జీహెచ్‌ఎంసీ పనులంటేనే కాంట్రాక్టర్లు హడలెత్తిపోయి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ విభాగం సారథ్యంలో జరగాల్సిన నాలా పూడికతీత ఇప్పటివరకు చాలాచోట్ల ప్రారంభం కాలేదు. డిసెంబర్‌లో పనులకు టెండర్లు పిలిచి జనవరిలో ప్రారంభించి మే నెలాఖరు కల్లా పూర్తి చేయాల్సిన చోట.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దీనికి తోడు ఎస్‌ఎన్‌డీపీ మొదటి దశను ఇంకా పూర్తి చేయలేకపోవడం ..పూడికతీత పనులు చేపట్టకపోవడంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది.

### ఆలస్యంతో పొంచి ఉన్న ప్రమాదం

జీహెచ్‌ఎంసీ పరిధిలో సుమారుగా 1302 కిలోమీటర్లు పొడవైన వరద నీటి కాలువలున్నాయి. వీటిలో పెద్ద నాలాల పొడవు 390 కిలోమీటర్లు. చిన్న నాలాలు 912 కిలోమీటర్ల పొడవున్నాయి. వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు అవసరమైన మరమ్మతులకు, పునరుద్ధరణ పనులకు ప్రతి సంవత్సరం రూ.50 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.ఈ పనులు సకాలంలో జరిగితే ముంపు తీవ్రత అంతగా ఉండదు. కానీ వేర్వేరు కారణాలను సాకుగా చూపించి అధికారులు ఆలస్యం చేస్తుండడంతో నీటి ముంపు తప్పడం లేదు. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం నాటికల్లా పూర్తి కావాల్సిన పనులను 80 శాతమే పూర్తి చేసి తొలకరి జల్లు నాటికి పూడికతీతను వర్షార్పణం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే 2024 సంవత్సరంలో 3.12 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను తీసి 81 శాతం పనులతో ముగించారు. రికార్డుల్లో మాత్రం ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీస్తున్నట్లు లెక్కలు చూపిస్తూ పనుల పారదర్శకతకు పాతర వేస్తుండడం గమనార్హం.



## శామీర్‌పేటలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

శామీర్‌పేట: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శామీర్‌పేటలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కరీంనగర్‌లో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ సమావేశానికి హాజరయ్యేందుకు కేటీఆర్ శామీర్‌పేట మీదుగా కరీంనగర్‌కు వెళ్తున్న విషయం తెలుసుకున్న శామీర్‌పేట, తూంకుంట, మూడుచింతలపల్లి, జవహర్‌నగర్ బీఆర్‌ఎస్ శ్రేణులు రాజీవ్ రహదారిపై శామీర్‌పేట కట్టమైసమ్మ వద్దకు చేరుకున్నారు. తమ ప్రియతమ నేత రావడంతో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. కేటీఆర్‌కు శాలువాలు కప్పి సన్మానించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నోముల శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






### చలాన్ల మోత

సిటీబ్యూరో: గ్రేటర్ జనంపై జీహెచ్‌ఎంసీ చలాన్ల మోత మోగిస్తున్నది. రహదారులపై చెత్త వేసిన వారిపై రూ. 500ల నుంచి రూ. 25వేల వరకు, భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారికి రూ. 25 వేల వరకు జరిమానాలు విధిస్తున్నది. సర్కిల్ స్థాయి అధికారులు వివిధ వ్యాపారస్తులు, దుకాణాదారులే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఇప్పటి వరకు సీసీఎంఎస్ ద్వారా రూ. 10 లక్షల జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్ల మీద చెత్త వేసినందుకు రూ. 5 లక్షల 41వేల ఫైన్ వేసినట్లు చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్ల మీద వేసిన 37 మందిని గుర్తించి రూ. 5 లక్షల 50వేలు వేసినట్లు చెప్పారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ శాఖలు సంయుక్తంగా కలిసి 259 మంది నుంచి రూ.10 లక్షల జరిమానాలు వేశామన్నారు.

# సండే సన్‌రైజర్స్ సందడి





సిటీబ్యూరో, మార్చి23, (నమస్తే తెలంగాణ): గ్రేటర్ మొత్తం ఆదివారం క్రికెట్ సందడి నెలకొంది. ఐపీఎల్-18 సీజన్ ప్రారంభం కావడం, అందులో తొలిరోజే సన్‌రైజర్స్ హైదరాబాద్ రాజస్థాన్ రాయల్స్‌తో పోటీ పడటంతో క్రికెట్ అభిమానులు టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పలు గేటెడ్ కమ్యూనిటీల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ముందస్తు టికెట్లు కొనుగోలు చేసుకున్న వారు నేరుగా ఉప్పల్ స్టేడియానికి వెళ్లి ప్రత్యేక్షంగా మ్యాచ్‌ను తిలకించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు విజయం సాధించడంతో అభిమానులు సంబురాలు చేసుకున్నారు.







## ఓయూ హాస్టల్‌లో నీళ్లులేవ్

### రాత్రి రహదారిపై విద్యార్థినుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థినులు నీటి కోసం ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. వర్సిటీలోని సెంటినరీ హాస్టల్లో నీరు లేదంటూ విద్యార్థినులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ తమకు సరిపడా నీరు అందించడం లేదని మండిపడ్డారు. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా..స్పందించడం లేదని మండిపడ్డారు. నూతన సెంటినరీ హాస్టల్ విద్యార్థినులకు కేటాయించినప్పటికీ మౌలిక వసతులు లేకుండా ఎలా ఉండాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



## కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..

### గులాబీ గూటికి 50 మంది కాంగ్రెస్ నేతలు
### హామీలు అమలు చేయడంలో సీఎం రేవంత్ విఫలం
### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. హైదర్‌నగర్ డివిజన్ లోని రామ్ నరేశ్ నగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. పచ్చిఅబద్ధాలతో పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని... నేటికీ తులం బంగారం ఊసే లేదని విమర్శించారు. అబద్ధపు హామీలతో సర్కారు ను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు.



## మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట: గ్రామాల్లో ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహేశ్వరి నియోజకవర్గానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, మహేశ్వరం మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## లెగ్.. ప్లేయింగ్.. ఈటింగ్..!

### బెట్టింగుల కోసం కోడ్ భాష
### సిటీలో జోరుగా సాగుతున్న బెట్టింగ్‌లు

సిటీబ్యూరో: ఐపీఎల్ సీజన్ మొదలైంది. హైదరాబాద్‌లో బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. ఒకవైపు బెట్టింగ్ యాప్‌లపై పోలీసులు సీరియస్‌గా దృష్టిపెట్టి ప్రమోటర్స్‌పై కేసులు పెడ్తుంటే మరోవైపు బెట్టింగ్ మాఫియా ఇవేవీ పట్టనట్లు తమ పని తాము చేసుకుపోతున్నాయి. క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంలో పలు నిషేధ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ నడుస్తున్నది. ఈ బెట్టింగ్‌లో ఎక్కువశాతం యువతే పాల్గొని డబ్బులు కోల్పోతున్నట్లు పోలీసులు చెప్పారు.

### కోడ్ భాషతో బెట్టింగ్..!

పందేలు కాసేవారు బుకీల దగ్గర కోడ్ భాష వాడుతూ తమ ఆట కొనసాగిస్తున్నారు. బెట్టింగ్‌లో గెలిచినవారికి డబ్బులు ఎలా ఇవ్వాలో కూడా ముందుగానే మాట్లాడుకుంటున్నారు. బెట్టింగ్‌లో పాల్గొంటున్న యువత వాడే కోడ్ భాషలో లెగ్ అనే పదం కీలకమైంది. ఎన్ని లెగ్గులు తీసుకుంటే లెక్క ప్రకారం అంత మొత్తం చెల్లించాలని దాని అర్థం. అలాగే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న జట్టుపై పందెం కాసేందుకు ప్లేయింగ్ అనే పదాన్ని, తక్కువ అవకాశాలున్న జట్టుపై ఈటింగ్ అనే పదాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుమారుగా 180 చోట్ల ఈ బెట్టింగులు జరుగుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. మరోవైపు నగర సీపీ సీవీ ఆనంద్ సీరియస్‌గా ఉన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడినా, వారికి ఎవరూ సహకరించినా కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిస్తున్నారు.